సాక్షి ఒడిశా

శుక్రవారం । 8 । సెప్టెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,02,375లు, బంగారం 150 మిల్లీ గ్రాములు, వెండి 71.6 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



రోడ్డుపై వరినాట్లు

జయపురం పబలిగుడలో రోడ్డుపై వరినాట్లు వేశారు. రోడ్ల తీరుకు ఇలా నిరసన తెలిపారు. - IIలో▸

గుణుపూర్ సబ్ డివిజన్‌లో గిరిజన సాధన కేంద్రాలు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పరిధిలో గల విక్రంపురం, రామనగుడ, గుడారి, పద్మపూర్ ప్రాంతాల్లో గిరిజన సాధన కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ గురువారం భూమిపూజ చేశారు.

న్యూస్‌రీల్

రాయగడలో మూభీ మితా అభిజాన్ ప్రారంభం



ప్రసంగిస్తున్న రామేశ్వర్ ప్రధాన్, పక్కనే సబ్ కలెక్టర్ భీమసేన్, రైతా



కార్యక్రమలో పాల్గొన్న విద్యార్థులు

రాయగడ: భారత ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఓటరు జాబితా స్వీయ సంక్షిప్త సవరణ కార్యక్రమం ప్రారంభమైంది. స్థానిక డీఆర్‌డీపీ సమావేశ మందిరంలో గురువారం నాడు జిల్లా అదనపు మేజిస్ట్రేట్ రామేశ్వర్ ప్రధాన్ అధ్యక్షత న మూభీ మితా అభిజాన్ పేరిట ప్రారంభమైన ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ భీమ సేన్ సాబొరా, జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రైతా, డిప్యూటీ కలెక్టర్ నారాయణ మిశ్రో, జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్ వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏడీఎం రామేశ్వర్ ప్రధాన్ పిలుపు నిచ్చారు. గ్రామాల్లో గల ప్రతి ఇంటికీ ఆయా ప్రాంతాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు వెళ్లి ప్రచారం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులను కూడా భాగస్వాములు చేయాలన్నారు., అనంతరం సమితి అధికారి నీలాంచల్ మిశ్రా మూభీ మితా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఓటరు జాబితాల్లో చేర్పించే విధానం గురించి వివరించారు.

1 నుంచి రాత్రి సమయంలో.. విమాన సేవలకు అంతరాయం

భువనేశ్వర్: స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం (బీపీఐఏ)లో అక్టోబర్ నెల 1వ తేదీ నుంచి రాత్రి 8 గంటలపాటు విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడుతుంది. ఈ మేరకు బీపీఐఏ డైరెక్టర్ ప్రసన్న ప్రధాన్ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక విమానాశ్రయంలో రన్ వే రీ–కార్పెటింగ్ పనులను అక్టోబర్ 1 నుంచి చేపట్టనున్నట్లు తెలిపారు. సాధారణంగా వర్షా కాలం తర్వాత తేమ లేని కారణంగా రన్ వే మరమ్మతులు నిర్వహిస్తామన్నారు. ఈ వాతావరణం పనిలో ఉపయోగించే పదార్థాలను సక్రమంగా వినియోగించేందుకు సహాయపడుతుందని వివరించారు. రీ కార్పెటింగ్‌తో పాటు రన్‌వే వెంబడి ఇన్‌స్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్ (ఐఎల్ఎస్) రెండో వర్గం లైటింగ్ పనులు చేపడతామన్నారు. రన్ వేను రీ కార్పెటింగ్ చేసేందుకు రూ.72 కోట్లు, లైటింగ్ సౌకర్యాల కోసం రూ.19 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. పనులను సులభతరం చేయడానికి, విమానాశ్రయంలో రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు, రాత్రి 11 నుంచి ఉదయం 7 గంటల వరకు 8 గంటలపాటు విమాన సర్వీసులకు అంతరాయం కలుగుతుందన్నారు.

జగన్నాథ మందిరం అభివృద్ధికి చర్యలు



అభివృద్ధి పనులకు పూజ చేస్తున్న రాజ మేస్త్రీ కార్తీక మహరాణ

జయపురం: జయపురంలోని జగన్నాథ మందిరాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేసింది. ఈ సందర్భంగా ఆలయ పరిచాలన కమిటీ గురువారం పూజలు నిర్వహించింది. కార్యక్రమంలో రోడ్లు భవనాల ఇంజినీర్ క్షీరధర కందపాణి, ఆర్అండ్‌బీ సబ్‌డివిజనల్ అధికారి సోమనాథ్ త్రిపాఠి, జయపురం దేవదాయ ధర్మాదాయ అధికారి, తహసీల్దార్ శ్రీమతి సాగరిక షాడంగి, జగన్నాథ ఆలయ పరిచాలన కమిటీ అధ్యక్షుడు నరేంద్రనాథ్ నాయిక్, కార్యదర్శి స్వాధీన కుమార్ సాహు, కోశాధికారి భవానీ శంకర ఆచార్య, ఆలయ పూజారి డొంబురు పండ, దేవదాయ విభాగ ఉద్యోగి కృష్ణ చంద్ర దాస్, పరిచాలన కమిటీ సభ్యులు పాల్గొన్నారు. గంజాం జిల్లా బెలగుంట ప్రాంతం రాజమేస్త్రీ కార్తీక మహారాణ ప్రథమ పూజ చేశారు.

మార్గం సుగమం



మరుగున పడిన విమానాశ్రయ స్థలం

విమానాశ్రయం	రన్ వే పొడవు
అమర్దా ఎయిర్ స్ట్రిప్	3.5 కి.మీ
భువనేశ్వర్	3.2 కి.మీ
ఝుర్సుగూడ	2.7 కి.మీ
రూర్కెలా	1.9 కి.మీ
జైపూర్	1.2 కి.మీ
ఉత్కెలా	917 మీ

- త్వరలో భువనేశ్వర్–అమర్దా విమాన సేవలు
- చారిత్రాత్మక విమానాశ్రయం పునరుద్ధరణకు చర్యలు
- ఉడాన్ పథకంలో నిధులు కేటాయింపు

భువనేశ్వర్: మయూర్‌భంజ్ జిల్లాకు త్వరలో విమానయాన సౌకర్యం అందుబాటులోకి రానుంది. విమానాశ్రయం ఏర్పాటుకు క్షేత్రస్థాయి సదుపాయాలు అందుబాటులో ఉన్నందున త్వరితగతిన పనులు పూర్తవుతాయని ఆశిస్తున్నారు. రెండో ప్రపంచ యుద్ధ కాలం నాటి ప్రాచీన విమానాశ్రయంగా అమర్దా పేరొందింది. దీర్ఘకాలంలో దీని ప్రాధాన్యత మరుగున పడింది. తాజాగా మరోసారి తెరపైకి రావడం విశేషం. ఇది అత్యంత పొడవైన రన్ వే కలిగి ఉండడం మరో ప్రత్యేకత. ఈ విమానాశ్రయం పునరుద్ధరణకు నోచుకుంటే కొత్తగా 6వ విమానాశ్రయం అందుబాటులోకి వస్తుంది.

పునరుద్ధరణకు చర్యలు

ఉడాన్ పథకం కింద ఆర్‌సీఎస్ విమానాల నిర్వహణ కోసం మయూర్‌భంజ్ జిల్లా అమర్దా రోడ్ ఎయిర్ స్ట్రిప్‌ను కేంద్రం గుర్తించింది. ఈ చర్యతో రాష్ట్రంలో 6వ విమానాశ్రయం నుంచి విమాన సేవలు ప్రారంభమయ్యేందుకు మార్గం సుగమం అయింది. ఇటీవల కలహండి జిల్లా భవానిపట్న ప్రాంతంలో ఉత్కెలా ఎయిర్ స్ట్రిప్ ఆరంభం కావడంతో 5 విమానాశ్రయాలు పూర్తిస్థాయిలో పని చేస్తున్నాయి. పౌర విమానయాన శాఖ సమాచారం మేరకు అమర్దా రోడ్ ఎయిర్‌స్ట్రిప్ నుంచి భువనేశ్వర్ మరియు అమర్దా ప్రాంతాల మధ్య ఎయిర్ టాక్సీ రవాణా అందుబాటులోకి వస్తుంది. బాలాసోర్ ఎంపీ ప్రతాప్ చంద్ర షడంగికి పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య ఎం.సింధియా రాసిన లేఖలో ఈ విషయం తెలిపారు. వాస్తవానికి ఈ ప్రతిపాదన 2021 సంవత్సరం నుంచి పరిశీలనలో ఉన్నట్లు స్పష్టం చేశారు. ఇక్కడ నుంచి విమానాల రవాణా సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయడానికి ప్రత్యేకంగా కేంద్ర బృందం అమర్దా ఎయిర్‌స్ట్రిప్ ప్రత్యక్షంగా సందర్శించింది.

రూ.45 కోట్లు మంజూరు

ఈ ఎయిర్‌స్ట్రిప్ అభివద్ధికి రూ.45 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి జ్యోతిరాదిత్య ఎం.సింధియా తెలియజేశారు. ఉడాన్ పథకం కింద ఈ నిధులు కేటాయించారు. రక్షణ శాఖ రాష్ట్రానికి భూమిని అప్పగించిన తర్వాత ఎయిర్‌స్ట్రిప్‌లో అభివృద్ధి పనులు చేపడతామని, దీనికి ఒడిశా సర్కార్ అంగీకారం తెలిపినట్లు పేర్కొన్నారు. పునరుద్ధరణ ప్రక్రియ ముగిసిన అనంతరం విమానాల రవాణాకు శ్రీకారం చుడతారు.

800 ఎకరాల విస్తీర్ణం

దాదాపు 800 ఎకరాల విస్తీర్ణంలో సువిశాల విమానాశ్రయంగా రెండో ప్రపంచ యుద్ధంలో అమర్దా విశేష సేవలు అందించింది. 1940 సంవత్సరంలో రూ.3 కోట్ల వ్యయంతో నిర్మితమైన ఈ విమానాశ్రయం యుద్ధం తర్వాత మరుగున పడిందని చరిత్రకారుడు అనిల్ ధీర్ తెలిపారు. అమర్దా రోడ్ రైల్వేస్టేషన్ దగ్గరలో ఉన్న కారణంగా దీనికి అమర్దా రోడ్ ఎయిర్‌ఫీల్డ్ అని పేరు వచ్చినట్లు ఆయన వివరణ. దీనిని రాస్‌గోవింద్‌పూర్ ఎయిర్‌స్ట్రిప్‌గా పరిచయం చేసేందుకు యోచిస్తున్నారు. ఆసియాలోనే అతి పొడవైన రన్ వేను కలిగి ఉన్నట్లు చరిత్రకారుని భోగట్టా. రన్ వేలు, టాక్సీ వేలు, అప్రాన్లు మొదలైనవి 60 కిమీ కంటే ఎక్కువ. కార్యకలాపాలు లేకపోవడంతో ఈ ప్రాంతం నిరుపయోగమై పశువుల సంచారానికి పరిమితమైందని విచారం వ్యక్తం చేశారు. 2వ ప్రపంచ యుద్ధంలో భారతదేశ రక్షణలో చాలా ముఖ్యమైన పాత్ర పోషించింది. 1943 మరియు 1945 సంవత్సరాల మధ్య ఇక్కడ జరిగిన కార్యకలాపాల వివరాలు ప్రభుత్వ మరియు సైనిక రికార్డులలో కూడా లేకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధ సమయంలో అమర్దా ఎయిర్‌స్ట్రిప్ ఒక ఫార్వర్డ్ ఎయిర్‌ఫీల్డ్‌గా సేవలు అందించింది. విమానాల కోసం ల్యాండింగ్ గ్రౌండ్‌గా మరియు ప్రత్యేక బాంబు దాడులకు శిక్షణా స్థలంగా కూడా ఉపయోగపడిందని పేర్కొన్నారు.

పలు ప్రాంతాలకు ప్రయోజనకరం

అమర్దా విమానాశ్రయం చారిత్రాత్మకమైనది. రెండో ప్రపంచ యుద్ధంతో దీని ప్రాధాన్యత ముడి పడి ఉందని చరిత్ర చెబుతోంది. దీని పునరుద్ధరణతో పలు ప్రాంతాలకు విమానయాన సౌకర్యం అందుబాటులోకి వస్తుందని కేంద్రమంత్రి బిశ్వేశ్వర్ టుడు పార్లమెంటులో ప్రస్తావించారు. అమర్దా రోడ్ ఎయిర్‌స్ట్రిప్ పునరుద్ధరణతో రాష్ట్రంలో మయూర్‌భంజ్, బాలాసోర్, కెంఝార్ జిల్లాలు, పొరుగు దక్షిణ బెంగాల్ మరియు తూర్పు జార్ఖండ్ రాష్ట్ర ప్రజల ప్రయాణ అవసరాలను తీరుస్తుందని ఆయన పేర్కొన్నారు. బాలాసోర్ జిల్లాలోని చాందీపూర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ మరియు పశ్చిమ బెంగాల్ ఖరగ్‌పూర్ ఐఐటీ వంటి కీలక సంస్థల అవసరాలకు అక్కరకు వస్తుందని వివరించారు.

పార పట్టుకుని..పనిలోకి దిగి



దేరాస్ ఆనకట్ట నీటి పారుదల అడ్డంకి తొలగింపు ప్రారంభించిన ఎంపీ అపరాజిత షడంగి

భువనేశ్వర్: రైతులకు సాగునీరు అందించేందుకు ఎంపీ అపరాజిత షడంగి స్వయంగా పార పట్టుకుని పనిలోకి దిగారు. నగరం శివార్లలోని డేరాస్ మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ నీటి పారుదల సౌకర్యం స్థానిక రైతులకు ఉపయోగపడడం లేదు. దీనిపై ఆమె క్షేత్ర స్థాయిలో అనుబంధ శాఖలు, విభాగాల ఉన్నతాధికారులతో తాజా స్థితిగతుల్ని సమీక్షించారు. పూడికల కారణంగా సాగునీరు రావడం లేదని తేలడంతో చేతిలో పార పట్టుకుని నీటి అడ్డంకి తొలగింపు పనులను స్వయంగా గురువారం ప్రారంభించారు. సాగునీరు సజావుగా ప్రవహించే వరకు పనులు కొనసాగుతాయని రైతులకు భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారితో కలిసి కొందరు సాగునీటి కాలువ నీరు ప్రవాహం అడ్డుకోవడంతో రైతులకు ప్రాజెక్టు నుండి సాగునీరు అందకుండా పోతోందని తెలిపారు. డేరాస్ ప్రాంతంలోని బాధిత వర్గాలు నెల రోజుల కిందట తనను సంప్రదించారని, గత రెండేళ్లుగా డేరా స్ మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ నుంచి సుమారు 300 ఎకరాల పంట పొలాలకు సాగు నీరు అందుబాటులోకి రావడం లేదని తెలియజేసినట్లు ఆమె మీడియాకు వివరించారు. వీరి అభ్యర్థన మేరకు ఈ ప్రాంతం సందర్శించి వ్యవసాయ, రెవెన్యూ, ఇంజనీరింగు ఉన్నతాధికారులతో అక్కడికక్కడే వాస్తవాస్తవాల్ని పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టేందుకు నడుం బిగించానన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయంలోని 'మూడో అంతస్తు' అధికారితో కలిసి మైనింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రైవేట్ సంస్థ ఈ ఆక్రమణకు పాల్పడిందని స్థానికులు సమాచారం అందించారని ఆమె పేర్కొన్నారు. అధికారులతో క్షుణ్ణంగా అధ్యయనం చేసి, చర్చించగా 150 ఎకరాలకు పైగా భూమి ఆక్రమణకు గురైందని తేలిందని, రోడ్డు నిర్మాణానికి 400 మీటర్లకు పైగా కాలువను పూడ్చి పెట్టినట్లు తేలిందని ఎంపీ అపరాజిత షడంగి పేర్కొన్నారు. అందుకే ప్రజలకు సాగునీరు అందేలా స్థానికుల సహకారంతో తవ్వకం పనులు ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. ఈ ప్రాంతంలో ఆక్రమణలు, సాగునీటిని అడ్డగించడానికి ఎవరు అనుమతించారో ఆరా తీయనున్నట్లు ప్రకటించారు.



ఇంజనీరింగు అధికారులతో క్షేత్ర స్థాయిలో సమీక్షిస్తున్న ఎంపీ

ఏడుగురు వ్యక్తులు అరెస్టు



అరెస్టైన ఏడుగురు వ్యక్తులు



పోలీసులు స్వాధీనం చేస్తున్న వస్తువులు

బరంపురం: గంజాం జిల్లా కబిసూర్యనగర్ బ్లాక్ పరిధి పాకలబడి గ్రామలో రెండు కుటుంబాల మధ్య జరిగిన దాడుల్లో ఏడుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఐఐసీ అధికారి చిత్రరంజన్ బెహరా తెలిపిన వివరాల మేరకు.. గురువారం వేకువ జామున గ్రామంలోని రెండు కుటుంబాల మధ్య దాడులు జరగడంతో పలువురికి గాయాలయ్యాయి. పోలీసులకు సమాచారం అందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి దగ్గర నుంచి ఒక తుపాకీ, 7 గుండ్లు, కత్తి, ఇనుప రాడ్ స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన వ్యక్తులు పాకలబడి గ్రామానికి చెందిన వల్లాబ బూంయ్యా, రోహిత్ బూంయ్యా, బిబు ప్రసాద్ బూంయ్యా, సోను బూంయ్యా, రంజిత బూంయ్యా, కున్ని బూంయ్యా మరియు ప్రభాసిని బూంయ్యాలుగా గుర్తించారు.

ఉద్యోగం పేరుతో మోసం

- ఒకరు అరెస్టు



అరెస్టు చేసిన లింగరాజ్‌ను చూపిస్తున్న పోలీసులు

మల్కన్‌గిరి: జిల్లాలో ఉపాధ్యాయ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.4 లక్షలు తీసుకొని మోసం చేసిన లింగరాజ్ మహనందో అనే వ్యక్తిని మల్కన్‌గిరి పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు... 2018లో ఈశ్వర్ కవాసీ అనే వ్యక్తి నుంచి ముందు రూ.50 వేలు, తర్వాత రూ.3.50 లక్షలు తీసుకొని లింగరాజ్ మోసం చేశారు. గతేడాది నుంచి ఉద్యోగం వస్తుందని నమ్మిన ఈశ్వర్ తాను మోసపోయానని గ్రహించి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు బౌద్ జిల్లాలోని ముండపోడ గ్రామంలో బుధవారం అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు.

బంగారం బిస్కెట్ల స్వాధీనం

- 2 కిలోల 464 గ్రాముల పట్టివేత
- నిందితుడు అరెస్టు



విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారుల తనిఖీలో పట్టుబడిన బంగారం బిస్కట్లు

భువనేశ్వర్: స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రెండు కిలోల బంగారం బిస్కెట్లను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బంగారం బిస్కెట్లను స్మగ్లింగ్ చేస్తున్న వ్యక్తిని గురువారం అరెస్ట్ చేశారు. కస్టమ్స్ విభాగం చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో బంగారం బిస్కెట్లు బయటపడ్డాయి. నిందితుని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. అనంతరం కేసు నమోదు చేసి స్థానిక కోర్టులో ప్రవేశపెట్టారు. కోర్టు రిమాండ్‌కు అనుమతించింది. తదుపరి విచారణ కొనసాగుతుంది. కస్టమ్స్ శాఖ అధికారుల తనిఖీల్లో 2 కిలోల 464 గ్రాముల బంగారు బిస్కెట్లు పట్టుబడడం గమనార్హం. స్వాధీనం చేసుకున్న బంగారు బిస్కెట్లు విదేశాల నుంచి భువనేశ్వర్‌కు తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ బిస్కెట్లపై విదేశీ ముద్రలు (గుర్తులు) గుర్తించారు.

గిరి జీవనానికి దర్పణం

- కొంధొ మల్లిగాంలో గిరిజన సాధన కేంద్రం ప్రారంభం



ఆదివాసీ యువకుని విగ్రహం



ఆదివాసీ మహిళ విగ్రహం



సాధన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సింగ్, పక్కనే టున్ని తదితరులు



చిన్నారుల ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు

రాయగడ: గిరిజనున జీవన శైలిని విద్యార్థులకు బోధించడమే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు జిల్లాలోని కొంధొ మల్లిగాం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గిరిజన సాధన కేంద్రం(ట్రైబల్ రిసోర్స్ సెంటర్)ను ఏర్పాటు చేసింది. కలెక్టర్ స్వాధాదవే సింగ్ గురువారం ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. గిరిజనుల భాష, సంస్కృతి, ఆచార వ్యవహారాలను పరిరక్షించడంతో పాటు భావి తరాలకు వాటి గురించి అవగాహన కలిగించేందుకు ఈ కేంద్రాన్ని ప్రారంభించామని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని పాఠశాలల్లో ఇలాంటి కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. ఈ కేంద్రాల ద్వారా ఆదివాసీ విద్యార్థులు మరింత జ్ఞానాన్ని పొందడానికి అవకాశం ఉంటుందన్నారు.

అపురూప సామగ్రి..

ఈ సాధన కేంద్రంలో ఆదివాసీల జీవన శైలిని ప్రతిబింబించే పరికరాలను ఏర్పాటు చేశారు. కొండ ప్రాంతాల్లో నివసించే గిరిజన తెగలకు చెందిన వారి ఆచార వ్యవహారాలు, వారి జీవన శైలిని అద్దం పట్టే విధంగా గోడలపై చిత్రాలను, బొమ్మలను ఏర్పాటు చేశారు. వారు పర్వదినాల్లో వినియోగించే సంప్రదాయ వాయిద్యాలను ఈ కేంద్రంలో ఉంచారు. గిరిజన ఆభరణాలు, సంగీత వాయిద్యాలు, వేట సాధనాలు, వ్యవసాయ పనిముట్లను కేంద్రంలో ఏర్పాటు చేశారు. జిల్లాలోని నియమగిరి పర్వత ప్రాంతాల్లో నివసించే ఆదిమ తెగకు చెందిన డొంగిరియా కొంధొల సంస్కృతికి అద్దం పట్టే శాలువాలు, పుటాసింగిలో నివసించే లంజియా సవర తెగకు చెందిన ఆదివాసీల జీవన శైలిని ప్రతిబింబించే ఇడితాల్ చిత్రాలు, గృహ అలంకరణలు అలాగే స్వదేశీ ఉత్పత్తులను కూడా ఈ కేంద్రంలో ఉంచారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పూర్ణ చంద్ర భొరియా, జిల్లా విద్యాశాఖ అదనపు అధికారి భజన్ లాల్ మాఝి, బీడీఓ లక్ష్మీనారాయణ సాబొతొ, రాయడ సమితి అధ్యక్షురాలు టున్ని హుయిక, సమితి వైస్ చైర్మన్ హరప్రసాద్ హెప్రుక, పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షులు సినియా హుయిక, ప్రధానోపాధ్యాయురాలు పుల్మతి ముదులి, ఉపాధ్యాయులు బిష్ణుప్రియ శెఠి, సిఆర్‌సి హేమానంద్ ఆచార్య తదితరులు పాల్గొన్నారు.



కళలను ప్రతిబింబించే పెయింటింగ్స్



సాధన కేంద్రాన్ని సందర్శిస్తున్న కలెక్టర్ సింగ్



సాధన కేంద్రంలో ఆదివాసీల సంప్రదాయ వాయిద్యపరికరాలు

క్లుప్తంగా

బంగారం దుకాణంలో దోపిడీ



అరెస్టు చేసిన వ్యక్తిని చూపిస్తున్న పోలీసులు

బరంపురం: నగరంలో ఉన్నటువంటి బంగారం దుకాణంలో జరిగిన దోపిడీ ఘటనలో దుకాణంలో పనిచేస్తున్న ఉద్యోగిని పోలీసులు అరెస్టు చేశారు. ఐఐసీ అధికారి భూపతి మహంతి తెలిపిన వివరాల మేరకు.. పెద్ద బజార్‌లోని శివాజీ బంగారం ఆభరణాల దుకాణంలో గురువారం దోపిడీ జరిగింది. జరిగిన దోపిడిపై యాజమని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దీనిలో భాగంగా దుకాణంలో పని చేస్తున్న ఉద్యోగిని అరెస్టు చేసి, ఒక బంగారం చైన్‌తో పాటు రూ.40 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన ఉద్యోగి లంజిపల్లిలోని రామనగర్‌కి చెందిన ఆదిత్య కుమార్ స్వాంయిగా పేర్కొన్నారు.

ఆనందపురంలో డెంగీ కలకలం


ఆనందపురంలో గ్రామంలో మందులను పిచికారీ చేస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండలంలోని ఆనందపురంలో డెంగీ కేసు నమోదైంది. గుంటూరు నుంచి ఆనందపురం గ్రామానికి ఓ వ్యక్తి జ్వరంతో రావడంతో ఆయనను రాజాం ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ డెంగీ అని నిర్ధారణ చేయడంతో గురువారం స్థానిక వైద్యులు పొన్నాడ హరితాశ్రీ, యశ్వంత్ ఆధ్వర్యంలో గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సర్పంచ్ చిత్తిరి మంజు, వైఎస్సార్‌సీపీ నాయకులు చిత్తిరి మోహన్ సమక్షంలో అన్ని వీధుల్లోని కాలువల్లో దోమల నివారణ మందులు పిచికారీ చేశారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారి టి.సురేష్, హెల్త్ అసిస్టెంట్ భాస్కరరావు, పేడాడ సత్తిరాజు, ఏఎన్ఎం యండమూరి నాగమణి, ఎంఎల్ఎస్‌పి రమా, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునికి ఘన సన్మానం

వజ్రపుకొత్తూరు: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికై అవార్డు అందుకున్న గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజిక్స్ ఉపాధ్యాయుడు జి.లక్ష్మణరావుకు అదే పాఠశాలలో గురువారం ఘన సన్మానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు పాలిన శ్రీనివాసరావు, టెక్కలి డివిజన్ డిప్యూటీ విద్యాశాఖాధికారి పగడాలమ్మలు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. విధి నిర్వహణలో చేసిన సేవలకు గుర్తింపు లభిస్తుందన్నారు. లక్ష్మణరావు మాస్టారు అంకితభావంతో విధులు నిర్వర్తించి నేడు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికై ఆదర్శంగా నిలవడంపై అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.హరిబాబు, వైఎస్సార్ సీపీ యువజన నాయకులు పాలిన ఉమామహేష్, పీటీ ఎస్.నాగరాజు, ఉపాధ్యాయులు సీతమ్మ, కె.సత్యరాజ్, పి.ఢిల్లేశ్వరరావు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యత


మాట్లాడుతున్న కృష్ణమోహన్

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పంచాయతీ రాజ్ ఈటీసీ అసిస్టెంట్ కమిషనర్ ఈ.కృష్ణమోహన్ అన్నారు. పంచాయతీ కార్యదర్శులకు ఎచ్చెర్ల సాంకేతిక శిక్షణ కేంద్రంలో జరుగుతున్న పంచాయతీ కార్యదర్శుల రెండో విడత పునశ్చరణ శిక్షణలో భా గంగా గురువారం నాలుగో రోజు శిక్షణలో పాల్గొని మాట్లాడారు. గ్రామంలో సిమెంట్ డ్రైనేజీలు, రో డ్డు, తాగునీటి సౌకర్యం, వీధి దీపాల నిర్వహణ, పారిశుద్ధ్యంకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో ప్రభుత్వ గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థ ఏర్పడిన తర్వాత అనేక మార్పు లు వచ్చాయని అన్నారు. గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, అంగన్‌వాడీ భవనాలు వంటి అనేక నిర్మాణాలు చేపడు తున్నట్లు చెప్పారు. గ్రామస్థాయిలో సుపరిపాలన సాగుతుందని, ప్రజల అవసరాలు స్థానికంగా తీరుతున్నాయని అన్నారు. గ్రామాలు పూర్తిస్థాయిలో ప్రగతి సాధించాలంటే మౌలిక వసతుల కల్పన, ప్రభుత్వ పథకాల అమలు కీలకమని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్, డీపీఓ రవికుమార్, రీసోర్సు పర్సన్లు శంకరావు, సత్యకేశవ, డీపీఎం ఎస్.లోక్‌నాథ్ పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురు అరెస్టు



పట్టుబడిన గంజాయితో నిందితులు

జయపురం: జయపురం సదర్ పోలీసులు గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద గల 22 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర గురువారం వెల్లడించారు. సదర్ పోలీసు స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.కె.బారిక్ పోలీసులతో బుధవారం రాత్రి 326 విజయవాడ-రాంచీ జాతీయ రహదారి డొంగరచించి కూడలి వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ బైక్‌ను తనిఖీ చేశారని, అందులో గంజాయి పట్టుబడిందని తెలిపారు. బైక్‌పై ఉన్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. వీరిని జయపురం సమితి బరిణిపుట్ వాసులు మోతీరాం పొరజ(25), సన పొరజ(30),ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం గజియాబాద్‌కు చెందిన ఫక్రుహ్ (21)గా గుర్తించినట్లు వివరించారు. వారు మల్కన్‌గిరి జిల్లా గోవిందపల్లి ప్రాంతంలో గంజాయి ఖరీదు చేసి ఉత్తరప్రదేశ్‌కు తీసుకువెళ్తున్నట్లు తేలిందన్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.2 లక్షల 20 వేలు ఉంటుందని తెలిపారు. వారి వద్ద నుంచి 3 సెల్‌ఫోన్లు, రూ.5 వేలుతో పాటు మోటారు బైక్ స్వాధీనం చేసుకున్నారు.

117 టన్నుల గంజాయి ధ్వంసం


గంజాయి వద్ద ఎస్పీ అభినవ్

కొరాపుట్: కొరాపుట్ జిల్లా పోలీసులు భారీ ఎత్తున్న గంజాయి ధ్వంసం చేశారు. కొరాపుట్ జిల్లా దమంజోడి లోని భారత అల్యూమినియం కేంద్రం (నాల్కో)లో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. కొరాపుట్ జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో పట్టుబడిన 117 టన్నుల 88 కిలోల గంజాయిని దగ్ధం చేశారు. ముందస్తుగా కోర్టు అనుమతి తీసుకున్నారు. కార్యక్రమాన్ని కొరాపుట్ ఎస్పీ అభినవ శంకర్ పర్యవేక్షించారు.

సమస్యలు పరిష్కరించాలని నర్సుల ఆందోళన


పెద్దాస్పత్రి ప్రసూతి విభాగం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేస్తున్న నర్సులు.

పర్లాకిమిడి: పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ స్థానిక 50 పడకల ఆస్పత్రిలోని నర్సులు గురువారం ఆందోళన నిర్వహించారు. ప్రసూతి, చైల్డ్‌కేర్ సెంటర్ వద్ద వీరు నల్ల బ్యాడ్జీలు ధరించి నరసన తెలియజేశారు. గ్రేడ్‌పే పెంచాలని, పదేళ్ల నుంచి పనిచేస్తున్నవారికి ప్రమోషన్లు ఇవ్వాలని, కేబీకే, కేబీకే ప్లస్‌లో పనిచేస్తున్న వారికి ప్లస్ బేస్ట్ అలవెన్సులు ఇవ్వాలని కోరారు. పదకొండు రోజుల పాటు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతామని తెలిపారు.

పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి కృషి


శాలిహుండం పర్యాటక భవనాన్ని పరిశీలిస్తున్న టూరిజం ఈడీ ఏఎల్ మల్‌రెడ్డి

గార: జిల్లాలో ఎన్నో ఆకర్షణీయ పర్యాటక ప్రదేశాలున్నాయని, వాటి అభివృద్ధికి కృషి చేస్తున్నామని రాష్ట్ర టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏఎల్ మల్‌రెడ్డి అన్నారు. మండలంలోని శాలిహుండం పర్యాటక బౌద్ధారామం, వసతి గృహాలను ఆయన గురువారం పరిశీలించారు. వేణుగోపాలస్వామి కొండ కింద భాగంలోని ప్రాంగణాన్ని వెంటనే పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కొండపై నున్న రిసార్టును పరిశీలించి పలు సూచనలు చూశారు. అక్కడి నుంచి వంశధార నది, పరిసర ప్రాంతాలను చూసి చాలా అందమైన ప్రదేశమని కితాబిచ్చారు. కళింగపట్నం బీచ్‌ను పరిశీలించి పర్యాటకులకు అనుగుణంగా పలు నిర్మాణాలు చేపట్టాలని టూరిజం ఇంజినీరింగ్ సిబ్బందికి సూచించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో పర్యాటక రంగం అత్యంత వేగంగా వృద్ధి చెందుతోందన్నారు. పర్యాటక రంగం అభివృద్ధితోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమని చెప్పారు. ప్రభుత్వానికి ఆదాయ వనరులతో పాటు యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయన్నారు. యువ పర్యాటక క్లబ్బులు ఏర్పాటు చేయడంతో పాటు పర్యాటక ప్రదేశాలపై విస్తృత ప్రచారం కూడా అవసరమన్నారు. శాలిహుండం, కళింగపట్నంలో పర్యాటకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖాధికారి నడిమింటి నారాయణరావు, ఈఈ రమణ, డీఈ స్వామి, ఏఈ సీతారామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

12, 13 తేదీల్లో స్కూల్ గేమ్స్‌కు ఎంపికలు

సీతంపేట: ఈ నెల 12, 13 తేదీల్లో స్కూల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌కు ఎంపికలు జరగనున్నాయని ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకాబ్ దయానంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత అన్ని పాఠశాలల యాజమాన్యాలు పాఠశాల స్థాయిలో ప్రతిభ గల క్రీడాకారులను ఎంపిక చేసి పంపించాలన్నారు. ఈ నెల 8వ తేదీ నుంచి గేమ్స్ జరగాల్సి ఉన్నప్పటికీ వర్షాలు కురుస్తున్న కారణంగా తాత్కాలికంగా వాయిదా పడ్డాయని తెలిపారు. ఈ విషయాన్ని గమనించాలన్నారు.

రెండు నెలల్లో నూతన వంతెనకు టెండర్


నూతన వంతెన నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ జాన్ సుధాకర్, అధికారులు

ఇచ్ఛాపురం రూరల్: బాహుదా వంతెన కూలిన మూడు నెలల్లో కొత్త వంతెన నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, మరో రెండు నెలల్లో కొత్త వంతెనకు టెండర్ పూర్తవుతుందని ఆర్అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్ అన్నారు. ఆయన బుధవారం ప్రత్యామ్నాయ వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ సుమారు రూ.20కోట్లతో పాత వంతెన పక్కన కొత్త వంతెన నిర్మించేందుకు ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని అన్నారు. వంతెన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించామని, బాహుదా నదికి భారీగా వరద నీరు చేరినప్పుడు వంతెనపై నుంచి నీరు పారే చాన్స్ లేకుండా పాత వంతెనకు కాస్తా ఎత్తులో కొత్త వంతెన నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే వంతెన నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు.ప్రస్తుతం ప్రత్యామ్నాయంగా నిర్మించిన వంతెనపై కేవలం రెండు, మూడు చక్రాల వాహనాలకే అనుమతులు ఇచ్చామని, అనుమతులు పాటించని వాహనాలపై కేసులు నమోదు చేస్తామని అన్నారు. ఆయన వెంట ఈఈ పి.సత్యనారాయణ, డీఈ ఎస్.రామినాయుడు, ఏఈఈ డి.మోహనరావులు ఉన్నారు.

నాటుసారా బట్టీలపై దాడి


స్వాధీనం చేసుకున్న సామగ్రితో ఎక్సైజ్ సిబ్బంది

బరంపురం: నగర శివారులో అక్రమంగా నడుస్తున్న సారా బట్టీలపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. గురువారం ఉదయం గొళంతరా పోలీసుస్టేషన్ పరిధి ఇందిరాక్కి గ్రామ శివారు మొగలి పొదలో అక్రమంగా తయారు చేస్తున్న నాటు బట్టీపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. అదేవిధంగా కె.నువాగాం పోలీసుస్టేషన్ పరిధి చికిటి పెంట శివారు అటవీ ప్రాంతంలో అక్రమంగా తయారు చేస్తున్న నాటుసార బట్టీలపై సైతం దాడులు చేపట్టారు. దీనిలో భాగంగా 3,600 లీటర్ల నాటుసారా ధ్వంసం చేసి, సామగ్రి స్వాధీనం చేసుకున్న తెలిపారు.

• అతిథి దేవో భవ



పూరీ సాగర తీరంలో అమెరికా అధ్యక్షునికి స్వాగతం పలుకుతున్న అపురూప సైకత శిల్పం

భువనేశ్వర్: దేశంలో నిర్వహించనున్న జీ 20 సదస్సుకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ హాజరుకానున్నారు. ఆయన శుక్రవారం ప్రధాని మోదీతో సమావేశంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా అంతర్జాతీ య సైకత కళాకారుడు సుదర్శన్ పట్నాయక్ అమెరికా అధ్యక్షుడికి స్వాగతం పలికేందుకు భారతీయ సంప్రదాయం అతిథి దేవో భవకు అద్దం పట్టే రీతిలో పూరీ సాగర తీరంలో 6 అడుగుల సువిశాల అపురూప సైకత శిల్పం తీర్చిదిద్దారు. ఈ శిల్పం రూపకల్పనలో 2 వేల ప్రమిలను వినియోగించారు.

రైలు పట్టాలపై కూలిన చెట్టు


రైలు పట్టాలపై కూలిన చెట్టు

• రైళ్ల రాకపోకలకు కొంతసమయం అంతరాయం

భువనేశ్వర్: మయూర్‌భంజ్ జిల్లో బెటానోటి రైల్వే స్టేషన్‌లో గురువారం భారీ చెట్టు పట్టాలపై పడిపోవడంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చెట్టు విరిగి రైలు లైన్‌పై పడటంతో పట్టాల పైన ఉన్న విద్యుత్ తీగ తెగిపోయింది. దీంతో ఈ మార్గంలో రైళ్ల రాకపోకలకు కొంత సమయం అంతరాయం ఏర్పడిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. రెండు రైళ్లు వేర్వేరు రైల్వే స్టేషన్లలో ఆగడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందిపడ్డారు. బాలాసోర్-బంగిరిపోసి బెటానోటి స్టేషన్‌కు దగ్గరగా ఉన్న కృష్ణచంద్రపూర్ రైల్వే స్టేషన్‌లో కొంతసమయం రైలు నిలిచిపోయింది. చెట్టును తొలగించి పట్టాలను సరిచేసే పనులు రైల్వే అధికారులు చేపట్టారు. ఈ మార్గంలో సాధారణ రైళ్ల రాకపోకలను పునరుద్ధరించేందుకు సత్వర చర్యలు చేపట్టారు.

• రోడ్డుపై వరినాట్లు

• ఎన్నికలు బహిష్కరిస్తామని పబలిగుడ గ్రామస్తుల హెచ్చరిక


రోడ్డులో వరి నాట్లు వేస్తున్న గ్రామస్తులు

జయపురం: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడచింది. ఎన్నికల సమయంలో ప్రతీ గామానికి రోడ్లు వేస్తామని రాజకీయ నేతలు ప్రజలకు వాగ్దానాలు చేస్తూనే వస్తున్నారు. కానీ ఆ హామీ నేటికీ నేరవేరలేదు. ప్రతి గ్రామాన్ని పంచాయతీ కేంద్రంతో రహదారి సౌకర్యం కల్పించేందుకు కనెక్టివిటీ రోడ్ల పథకం ప్రభుత్వం తెచ్చింది. ప్రధాన మంత్రి గ్రామీణ షడక్, తదితర పథకాలు అమలు చేసినా నేటివరకు అనేక గ్రామాలకు కనీస రహదారులు లేవు. ఇందుకు ఉదహణే.. బొయిపరిగుడ సమది దసమంతపూర్ గ్రామ పంచాయతీ పబలిగుడ ఒకటని చెప్పవచ్చు. నేడు ఆ గ్రామ వాసులు తమ గ్రామ రోడ్డులో వరినాట్లు వేస్తూ కనిపించారు. ఈ గ్రామంలో 110కి పైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. ప్రధాన రోడ్డు అధ్వానంగా ఉంది. అనేక ఏళ్లుగా గ్రామానికి పక్కా రోడ్డు వేయాలని పాలకులను డిమాండ్ చేస్తూనే ఉన్నారు. వర్షా కాలంలో ఆ రోడ్డు చెరువులా మారుతుందని గ్రామ ప్రజలు తెలిపారు. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్తే 2022లో పక్కా రోడ్డు వేసేందుకు రూ.10 లక్షలు మంజూరు చేశారని గ్రామస్తులు తెలిపారు. నిధులు మంజూరైనా నేటికీ పనులు ప్రారంభం కాలేదన్నారు. రోడ్డు బురదమయమై కావడంతో గ్రామం నుంచి బయటకు రాలేకపోతున్నామని, అందువల్లే వరి నాట్లు వేస్తూ నిరసన తెలియజేశామన్నారు. వెంటనే రోడ్డు పనులు ప్రారంభించకపోతే రానున్న ఎన్నికలను తామంతా బహిష్కరిస్తామని హెచ్చరించారు.

వర్సిటీకి పాలక మండలి నియామకం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి పాలక మండలి (ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్) నియమించారు. ఈ మేరకు విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ జె.శ్యామలరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పాలక మండలి మూడేళ్లు కొనసాగనుంది. పాత పాలక మండలి ఆరు నెలల క్రితం టెర్మ్ పూర్తికావటంతో రద్దయ్యింది. ఈ పాలక మండలిలో విశ్వ విద్యాలయం సీనియర్ ప్రొఫెసర్ విభాగంలో ప్రొఫెసర్ పీలా సుజాత, పిన్సిపాల్ విభాగంలో ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్ల విభాగంలో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ, వర్సిటీ అధ్యాపకుల విభాగంలో డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్, అనుబంధ కళాశాలల అధ్యాపకులు విభాగంలో పాతపట్నం డిగ్రీ కళాశాల ఎకనామిక్స్ అధ్యాపకులు చక్రపతి, పరిశ్రమలు, న్యాయ విభాగం, సంఘసేవ విభాగాలకు సంబంధించి గడ్డ శ్రీనిబాబు, పైడి వాసమ్మ, పెద్ద రమణకుమారి, కారెడ్ల మాధవిలను నియమించారు.

ముత్తూట్ ఫైనాన్స్ ఆఫీస్‌కు తాళాలు


ముత్తూట్ ఫైనాన్స్ ఆఫీస్‌కు తాళాలు వేస్తున్న ఖాతాదారులు

నరసన్నపేట: స్థానిక జయలక్ష్మి కాంప్లెక్స్ పైఅంతస్తులో ఉన్న ముత్తూట్ ఫైనాన్స్ ఆఫీస్‌కు ఖాతాదారులు గురువారం తాళాలు వేశారు. తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారని, ఖాతాదారుల సొమ్ముతో పరారైన బ్యాంకు మేనేజర్ నుంచి డబ్బు రికవరీ చేయకుండా తిరిగి ఆయనకు ముత్తూట్ ఫైనాన్స్‌కు చెందిన పైస్థాయి సిబ్బంది వత్తాసు పలుకుతున్నారని ఖాతాదారులు గురువారం మరోసారి ఆందోళనకు దిగారు. గతంలో ఆందోళన చేపట్టిన ఖాతాదారులకు కొద్దిరోజులు సమయం ఇవ్వండి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ఆఫీస్ సిబ్బంది ఇంతవరకూ న్యాయం చేయలేదు. దీనిపై గురువారం ప్రశ్నించిన ఖాతాదారులకు సిబ్బంది నుంచి సరైన సమాధానం రాలేదు. దీంతో వారు ఆఫీస్‌కు తాళాలు వేశారు. ఈ సందర్భంగా ఖాతాదారులు తూముల శ్రీనివాసరావు, కూన చిన్నారావు, బచ్చు అప్పన్న, తంగుడు పకీరు, కూన వాసుదేవరావులు మాట్లాడుతూ తమ నుంచి గతంలో ఇక్కడ మేనేజర్‌గా పని చేసిన యుగంధర్ డబ్బులు తీసుకుని తప్పుడు రశీదులు ఇచ్చారని తెలిపారు. దీన్ని ఆధారాలతో సహా నిరూపించామని, గతంలో నరసన్నపేట పోలీసుల సమక్షంలో పది రోజుల్లో డబ్బులు క్లియర్ చేస్తామని, బంగారు ఆభరణాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారని, 30 రోజులు అవుతున్నా స్పందన లేదని తెలిపారు. గురువారం రమ్మని చెప్పి కూడా ఎవరూ పట్టించుకోలేదన్నారు. దీంతో సహనం కోల్పోయి తప్పనిసరి పరిస్థుతుల్లో ఆఫీస్‌కు తాళాలు వేశామని తెలిపారు. ఇప్పటికైనా ముత్తూట్ ఫైనాన్స్ పైస్థాయి ప్రతినిధులు జోక్యం చేసుకొని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

• ప్రగతి 'బాట'న


ఒకప్పుడు బెండి నుంచి కోసంగిపురం వెళ్లే రోడ్డు దుస్థితి


ప్రస్తుతం రోడ్డు

పలాస: వజ్రపుకొత్తూరు మండలం బెండి గేటు నుంచి కాశీబుగ్గ పాతజాతీయ రహదారి, కోసంగిపురం కూడలి వరకు గల రోడ్డు రూపు రేఖలు పూర్తిగా మారి పోయాయి. ఒకప్పుడు ఈ రహదారి నరకాన్ని తలపించేది. స్థానిక మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు చొరవ చూపి సీఎం దృష్టికి సమస్యను తీసుకెళ్లి రూ.2కోట్లు మంజూరు చేశారు. దీంతో ఈ రోడ్డుకు మోక్షం కలిగింది. ఇప్పుడు పనులు పూర్తి కావడంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

నేత్రదానంపై అవగాహన కల్పించాలి

- జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ శివప్రసాద్


కార్యక్రమంలో మాట్లాడుతున్న శివప్రసాద్

విజయనగరం ఫోర్ట్: నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ బి.శివప్రసాద్ అన్నారు. ఈ మేరకు నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా వైద్యవిద్యార్థులు, వైద్య సిబ్బందికి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని కంటి విభాగంలో గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఏవయస్సు వారైనా, ఇంతకు ముందు కంటి అద్దాలు వాడిన వారైనా కంటి ఆపరేషన్ చేయించుకున్న వారైనా నేత్రదానం చేయవచ్చన్నారు. నేత్ర దాత కంటిపై ఉన్న పలుచని పొర మాత్రమే తొలగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సౌమ్య, డాక్టర్ జస్వంత్, డాక్టర్ పావని, డాక్టర్ అర్చన, అప్తాలిమక్ అధికారులు ఎస్వీఆర్ కృష్ణారావు, బాలాజీ ప్రాణిగ్రహి, తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీకి ఎస్పీ అభినందనలు


హెచ్‌సీ కృష్ణంనాయుడిని అభినందిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో పతకాలు సాధించిన హెడ్ కానిస్టేబుల్ కృష్ణంనాయుడును ఎస్పీ ఎం.దీపిక గురువారం తన చాంబర్‌లో అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీలంక దేశంలోని దియాగమ మహింద్ర రాజపక్సే స్టేడియంలో ఆగస్టు 19 నుంచి 21 వరకూ జరిగిన అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ -2023 పోటీల్లో రూరల్‌పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న వి. కృష్ణం నాయుడు విశేష ప్రతిభ కనబరిచి రెండు రజత, ఒక కాంస్య పతకం సాధించారన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం చాలా గొప్ప విషయమని ఆయన క్రీడాస్ఫూర్తి యువతకు ఆదర్శనీయమన్నారు. ఈ మేరకు ఆయనను ఇన్చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, రూరల్ సీఐ టీవీ.తిరుపతిరావు, ఎస్సై గణేష్, పోలీసు అధికారులు, సిబ్బంది అభినందించారు.


నిరంతరం ప్రజలతో మమేకమవ్వాలి

- బీజేపీ ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జ్ గారపాటి


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఉతరాంధ్ర జోనల్ ఇన్‌చార్జ్ గారపాటి

విజయనగరం టౌన్: నిరంతరం ప్రజలతో మమేకమై భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కృషిచేయాలని బీజేపీ ఉత్తరాంధ్ర జోనల్ ఇన్చార్జ్ గారపాటి సీతారామాంజనేయ చౌదరి పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక రింగురోడ్డులో ఉన్న బీజేపీ కార్యాలయంలో గురువారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం నెల్లిమర్ల అసెంబ్లీ పరిధిలోని రామతీర్థంలో మేరా మాటి-మేరా దేశ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తీగల హరనాథ్, కోటగిరి నారాయణరావు, బొబ్బిలి శ్రీను, బూర్లె శ్రీధర్, ఉత్తరావల్లి మోహనరావు, కుసుమంచి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మడ్డువలసకు నీటితాకిడి


ప్రాజెక్టు నుంచి విడిచిపెట్టిన నీరు

వంగర: మండల పరిధిలోని మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టులో నీటిమట్టం పెరుగుతోంది. ప్రాజెక్టు వద్ద గురువారం ఉదయం 11 గంటల సమయానికి 64.10 మీటర్ల నీటిమట్టం నమోదైంది. వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో సువర్ణముఖి, వేగావతి నదుల్లో నీటి ప్రవాహం పెరుగుతోంది. రెండు నదుల నుంచి 5,172 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులో చేరుతోంది. రెండు గేట్లు ఎత్తి 2,500 క్యూసెక్కుల నీటిని అధికారులు కిందకు విడిచిపెడుతున్నారు. కుడి ప్రధాన కాలువ ద్వారా ఆయకట్టు భూములకు 600 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్టు ప్రాజెక్టు ఏఈ నితిన్ తెలిపారు.

కులవృత్తులకు ఆర్థిక చేయూత

- పీఎం విశ్వకర్మ యోజన అధికారులతో కలెక్టర్ సమీక్ష
- అర్హత కలిగిన వారంతా ఉపాధి పొందాలని సూచన


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా సంప్రదాయ కుల వృత్తులు, హస్తకళాకారులకు ఆర్థిక స్వావలంబన లభిస్తుందని.. అర్హులందరికీ ఫలాలు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. వృత్తి నైపుణ్యం పెంచి నాణ్యమైన ఉపాధి పొందేందుకు ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం దోహదం చేస్తుందని కావున జిల్లాలో అర్హత కలిగిన వారందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని నాణ్యమైన ఉపాధి పొందాలని కలెక్టర్ సూచించారు. ఈ మేరకు గురువారం ఆమె తన చాంబర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో పథకం అమలు, కలిగే ప్రయోజనాలు, అర్హుల గుర్తింపు, శిక్షణ తదితర అంశాలపై సమీక్షించారు. స్థానిక సచివాలయాలు, కామన్ సర్వీస్ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేయాలని పరిశ్రమల శాఖ అధికారులకు ఈ సందర్భంగా సూచించారు. వీలైనంత మంది అర్హులు పథకంలో చేరేలా ప్రణాళికాయుతంగా కృషి చేయాలని స్పష్టం చేశారు.

సమీక్షలో భాగంగా విశ్వకర్మ పథకం ప్రయోజనాలను, అర్హత ప్రమాణాలను జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఆర్.పాపారావు కలెక్టర్‌కు వివరించారు. 18 సంవత్సరాలు నిండిన వడ్రంగి, పడవల తయారీ, కవచాల తయారీ, కమ్మరి, కుమ్మరి, తాళాలు, ఇతర పనిముట్లు తయారు చేసేవారు, స్వర్ణకారులు, శిల్పకారులు, చర్మకారులు, చెప్పులు తయారు చేయువారు, తాపీమేస్త్రీలు, బుట్టలు, చాపలు, చీపుర్లు, బొమ్మలు, ఇతర ఆట వస్తువులు తయారు చేసేవారు, క్షురకులు, పూలదండలు తయారు చేసేవారు, రజకులు, దర్జీలు, చేపల వలలు తయారు చేసేవారు అర్హులని పేర్కొన్నారు. మొబైల్ ఫోనుకు లింకైన ఆధార్ కార్డు సాయంతో స్థానిక సచివాలయం లేదా కామన్ సర్వీసెస్ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించారు. కుటుంబంలో ఒక్కరికే అవకాశం ఉంటుందని అన్ని అర్హతలు సరిపోతే విశ్వకర్మ సర్టిఫికెట్ అందజేస్తామని అలా పొందిన వారికి ఐదు రోజుల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని, శిక్షణ సమయంలో రూ.500 భృతితో పాటు రూ.15,000 విలువ కలిగిన టూల్ కిట్ అందజేస్తామని వివరించారు.

ప్రత్యేక శిక్షకులకు రూ.2 లక్షల రుణం

ప్రాథమిక శిక్షణ పూర్తి చేసుకున్న వారికి రూ.1లక్ష బ్యాంకు లోను ఐదుశాతం వడ్డీపై పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే 15 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ పొందిన వారికి ఐదు శాతం వడ్డీపై రూ.2 లక్షల రుణసదుపాయం కల్పిస్తామని చెప్పారు. మొదటి విడత రుణం 18 నెలల్లో, రెండో విడత రుణం 30 నెలల్లో తీర్చాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రాయితీ పథకాలు పొందిన వారు అనర్హులని పరిశ్రమల శాఖ జీఎం స్పష్టం చేశారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం ఆర్. పాపారావు, మెప్మా పీడీ సుధాకర్, జెడ్పీ సీఈవో రాజ్‌కుమార్, డీపీవో శ్రీధర్ రాజా, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గోవిందరావు, మున్సిపల్ కమిషనర్లు, డీఆర్డీఏ, మత్స్యశాఖ, బ్యాంకు అధికారులు, పరిశ్రమల శాఖ ఐపీవోలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి విశ్వకర్మ అర్హతలు:

- 18 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు కలిగి, వారి పూర్వీకుల నుంచి కుటుంబ వృత్తిగా చేస్తున్న హస్తకళాకారులు పీఎం విశ్వకర్మ కింద నమోదు చేసుకోవడానికి అర్హులు.
- లబ్ధిదారు కేంద్ర ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వం క్రెడిట్ ఆధారిత పథకాల కింద గతంలో రుణాలు పొంది ఉండకూడదు. (రుణాన్ని తిరిగి చెల్లించిన వారు పీఎం విశ్వకర్మ కింద అర్హులు)
- కుటుంబంలో ఒకరు మాత్రమే రిజిస్ట్రేషన్‌కు అర్హులు.
- కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉంటే ఈ పథకానికి అర్హులు కారు.

ప్రయోజనాలు :

- రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఐడీ కార్డు, సర్టిఫికెట్ ద్వారా గుర్తింపు ఇస్తారు.
- వారి వ్యాపార అభివృద్ధికి రుణాలు అందజేస్తారు. రూ.15000 వరకు పనిముట్ల ఇన్సెంటివ్
- డిజిటల్ ట్రాన్జాక్షన్‌పై నెలకు 100 ట్రాన్సాక్షన్స్ వరకు ట్రాన్సాక్షన్‌కు రూపాయి చొప్పున కమిషన్
- పథకం కింద నమోదైన కళాకారులు, కళాకారుల ఉత్పత్తులకు మార్కెటింగ్, బ్రాండింగ్‌కు మద్దతు ఇస్తారు.

అన్నదాతకు నిరంతరాయంగా ఉచిత విద్యుత్

- జిల్లాలో వ్యవసాయ బోరుబావులు 42,159
- విద్యుత్ కనెక్షన్లు 39,963


వ్యవసాయ పంపు సెట్

విజయనగరం ఫోర్ట్:

రైతు సంక్షేమమే ధ్యేయంగా జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలుచేస్తోంది. అందరికీ అన్నం పెట్టే రైతన్న సంతోషంగా ఉండాలనే ఉద్దేశంతో సాగు చేయడానికి పెట్టుబడి సాయం ఇస్తూ..విత్తనాలు, ఎరువులు రైతు చెంతకే అందిస్తోంది. సాగులో అధిక దిగుబడుల కోసం, అవసరమైన సలహాలు, సూచనలు అందించేందుకు పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాల ద్వారా పంట కొనుగోలు చేస్తోంది. ముఖ్యంగా సాగునీరు పంటలకు అందించేందుకు అవసరమైన ఉచిత విద్యుత్‌ను నిరంతరాయంగా అందిస్తూ రైతులకు మరింత అండగా నిలుస్తోంది.

డిమాండ్ పెరిగినప్పుడు కూడా..

నిన్న, మొన్నటి వరకు విద్యుత్‌కు డిమాండ్ పెరిగింది. విద్యుత్ ఉత్పత్తి తగ్గడంతో పరిశ్రమలకు పవర్ హాలిడే ప్రకటించిన విషయం తెలిసిందే. అటువంటి సమయంలో కూడా వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్‌ను ప్రభుత్వం సరఫరా చేసింది. ఈ మేరకు వ్యవసాయ పంపు సెట్లు ఉన్న ప్రాంతాలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. కొంత మంది రైతులు మొక్కజొన్న, చెరుకు, వేరుశనగ పండిస్తుండగా మరి కొంతమంది కూరగాయలు, అరటి, జామ వంటి పంటలు పండిస్తున్నారు.

ఏడాదికి రూ.161 కోట్లు వెచ్చిస్తున్న ప్రభుత్వం

జిల్లాలో ఉచిత విద్యుత్ నిమిత్తం ప్రభుత్వం కోట్లాది రుపాయలు వెచ్చిస్తోంది. జిల్లాలో వ్యవసాయ బోరుబావులు 42,159 ఉన్నాయి. అలాగే ఉచిత విద్యుత్ కనెక్షన్లు 39,963 ఉన్నాయి. వీటికి సంబంధించి ప్రభుత్వం ఏడాదికి రూ.161.08 కోట్ల వరకు నిధులు వెచ్చిస్తోంది.

వ్యవసాయానికి 9 గంటల విద్యుత్

వ్యవసాయానికి నిరంతరాయంగా 9 గంటల పాటు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. నాణ్యతతో కూడిన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయడం వల్ల రైతులు పంటలను ఇబ్బంది లేకుండా పండించుకోగలుగుతున్నారు.

ముప్వల లక్ష్మణరావు, విద్యుత్‌శాఖ, ఎస్.ఈ

కోడూరుమాత యాత్రను జయప్రదంచేయాలి


పుణ్యక్షేత్ర డైరెక్టర్ యుగల్‌కుమార్


మాతదర్శనానికి, ఫాదర్ల పూజ్యవాక్యాలు వినడానికి ఏర్పాటు చేస్తున్న బారికేడ్లు, టెంట్‌లు

బాడంగి: మండలంలోని కోడూరులో ఈనెల 9న జరగనున్న పరిశుద్ధ కోడూరుమాత యాత్రకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆపుణ్యక్షేత్ర డైరెక్టర్ పి.యుగల్‌కుమార్ కోరారు. ఈ మేరకు కోడూరు మాత యాత్రస్థలంలో ఆయన గురువారం మాట్లాడుతూ యాత్ర జయప్రదంగా జరిగేందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ జరుగుతున్నాయని చెప్పారు. .ఇప్పటికే మాతదర్శనానికి భక్తులు ఇబ్బంది పడకుండా క్యూలో నిలబడి వెళ్లేందుకు వీలుగా ప్రార్థనామందిరం పక్క నుంచి మాతకొలువైన గుహవరకు బారికేడ్లు ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. మాతను దర్శించుకుని ఫాదర్ల పూజ్యవాక్యాలు వినేందుకు వీలుగా టెంట్లు ఏర్పాటు చేస్తున్నామని, వర్షం తగ్గకుంటే ప్రార్థన మందిరంలోనే పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులసౌకర్యం కోసం పరిసరాలపరిశుభ్రత, తాగునీరు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. యాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా వలంటీర్లు, పోలీసుల సహకారాన్ని తీసుకుంటున్నట్లు చెప్పారు. కావున భక్తులు క్రమశిక్షణతో మెలిగి పోలీసువారికి సహకరించి యాత్రను జయప్రదం చేయాలని కోరారు.

కొత్తవలసలో విజిలెన్స్ దాడులు

- 1,532 కేజీల పీడీఎఫ్ బియ్యం,
- 9 గ్యాస్ సిలిండర్స్ సీజ్


విజిలెన్స్ సీఐ ఆధ్వర్యంలో సీజ్ చేసిన బియ్యం


హోటల్‌లో స్వాధీనం చేసుకున్న సిలిండర్స్

కొత్తవలస: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బి.సింహాచలం ఆధ్వర్యంలో సిబ్బంది కొత్తవలస మండలంలో గురువారం వేర్వేరు చోట్ల దాడులు నిర్వహించి పీడీఎఫ్ బియ్యం, గృహావసర గ్యాస్ సిలిండర్స్‌ను సీజ్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మిందిరామచంద్రపురం గ్రామంలో హనుమశెట్టి వెంకటేష్ ఇంటి వరండాలో అక్రమంగా నిల్వ ఉంచిన ప్రజాపంపిణీ వ్యవస్థ బియ్యం 1532 కేజీలను విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. సీజ్ చేసిన బియ్యం విలువ సుమారు రూ.58,216 అని ఆ బియ్యాన్ని రేషన్ డిపో నెంబర్ 22 డీలర్ కె.ప్రసాద్‌రావుకు అప్పగించామని అని సీఐ సింహాచలం తెలిపారు. నిందితుడిపై 6ఎ కేసు నమోదుకు సీఎస్‌డీటీ టి.ఇందిరకు సిఫారసు చేసినట్లు చెప్పారు. అలాగే పెందుర్తి-కొత్తవలస రోడ్డులో గల లక్ష్మి టిఫిన్స్ అండ్ మల్టీ క్యూజిన్ ఫ్యామిలీ రెస్టారెంట్‌లో గృహావసరాలకు వినియోగించే వంటగ్యాస్ సిలిండర్స్‌తో వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించి 9 సిలిండర్స్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సింహాచలం తెలిపారు. స్వాధీనం చేసుకున్న సిలిండర్స్‌ను స్థానిక ప్రియదర్శిని గ్యాస్ ఏజెన్సీలో భద్రపర్చమని అప్పగించి రెస్టారెంట్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దాడుల్లో విజిలెన్స్ కానిస్టేబుల్ గొర్లె పురుషోత్తం, సీఎస్‌డీటీ కొట్టిక్కి ఇందిర తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


మృతుడు శ్రీనివాసరావు ఫైల్

లక్కవరపుకోట: అప్పుల బాధను భరించలేక మండల కేంద్రంలోని గవర వీధికి చెందిన మళ్ల శ్రీనివాస రావు (52) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీనివాస రావు గ్రామంలో టెంట్ హౌస్ నడుపుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఈ క్రమంలో కొంత అప్పులు చేయాల్సి వచ్చింది. చేసిన అప్పులు చెల్లించలేక మనస్తాపానికి లోనై బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగేశాడు. విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే ఎస్.కోట సీహెచ్‌సీకి, అక్కడి విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు హెచ్‌సీ ఎస్.కొండబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాగా మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు కాగా వారికి వివాహాలయ్యాయి. ఒక కొడుకు ఉన్నాడు.

సైబర్ యాక్ట్ కేసులు నమోదు

విజయనగరం క్రైమ్: సైబర్ యాక్ట్ కింద కేసులు నమోదుచేసినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు గురువారం తెలిపారు. పట్టణంలోని పావనీనగర్‌కి చెందిన నసీమాకు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ప్రైజ్ మనీ వచ్చిందని ఫోన్‌కాల్ వచ్చింది. ఆ మాటలను నమ్మిన ఆమె వారు చెప్పిన నిబంధనల మేరకు రూ.లక్షా నాలుగువేలు డిపాజిట్ చేసింది. అనంతరం తాను మోసపోయినట్లు తెలుసుకుని వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. అలాగే ఉడాకాలనీలో ఉంటున్న జీబీఎస్ మూర్తి బజాజ్ ఫైనాన్స్ సర్వీస్, ఆర్‌బీఎల్ బ్యాంక్ సూపర్ కారా క్రెడిట్ కార్డును ఐదేళ్లుగా వాడుతున్నారు. ఈ క్రమంలో ఆయనకు 7407544340 నుంచి ఫోన్ కాల్ వచ్చింది. అది నమ్మిన మూర్తి తనకు వచ్చిన లింక్ ఆధారంగా బ్యాంక్ వివరాలు పొందుపరిచారు. దాని ద్వారా సైబర్ నేరగాళ్లు అతని అకౌంట్ నుంచి రూ.లక్షా 50వేలు దోచేశారు. విషయం తెలుసుకున్న బాధితుడు వెంటనే వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు ఫిర్యాదుల మేరకు కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

గడువులోగా పరిశ్రమల దరఖాస్తులకు పరిష్కారం

- భూ సమస్యలపై జేసీతో చర్చించాలి కలెక్టర్ నాగలక్ష్మి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం రూరల్: పరిశ్రమల స్థాపనకు సింగిల్ డెస్క్ పోర్టల్‌లో ఉన్న దరఖాస్తులను గడువుకు ముందే పరిష్కారించేలా పరిశ్రమల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కృషి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు సంబంధించి ఎక్కువగా భూ సమస్యలే తలెత్తుతున్నాయని, భూ సమస్యలన్నిటినీ ఏపీఐఐసీ అధికారులు, సంయుక్త కలెక్టర్ (జేసీ)తో చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. కొత్తవలస మండలం భీమాళిలో మామిడి తాండ్ర పరిశ్రమకు కోల్డ్ స్టోరేజీ కోసం ప్రైవేట్ భూమిని 25 ఏళ్లకు లీజుకు తీసుకుంటామని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పాపారావు తెలిపారు. ఈ పరిశ్రమను నాబార్డ్ ద్వారా రుణ సహాయాన్ని అందించి ఎఫ్‌పీవోలకు మంజూరు చేసే అవకాశం ఉందేమో పరిశీలించాలని కలెక్టర్ అడిగారు. భోగాపురంలో ఆక్వా పరిశ్రమకు వాటర్ పైప్‌లైన్ సమస్యను త్వరగా పరిష్కరించాలని మత్స్యశాఖ జేడీకి సూచించారు. సమావేశంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్వో గణపతిరావు, జిల్లా అధికారులు, ఏపీఐఐసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏటీఎంల చోరీపై మూడు కేసులు

బొండపల్లి: గజపతినగరం సర్కిల్ పరిధిలోని పెద మానాపురంతో పాటు బొండపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గొట్లాం గ్రామం వద్ద గల ఇండియన్1 ఏటీఎం కేంద్రాల్లో చోరీకి పాల్పడిన ఘటనలో మూడు కేసులు నమోదు చేసినట్లు పెదమానాపురం ఇన్‌చార్జ్ ఎస్సై గంగరాజు,బొండపల్లి ఎస్సై ఎస్.రవి తెలిపారు. ఈ కేసులకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.దత్తిరాజేరు మండలంలోని పెదమానాపురం గ్రామంలో గల ఏటీఎం కేంద్రం నుంచి రూ.11 లక్షల 96 వేలు, గొట్లాం గ్రామం వద్ద గల ఏటీఎం కేంద్రం నుంచి రూ.5 లక్షల81 వేలు నగదును అపహరించుకుపోయినట్లు ఇండియన్ ఏటీఎం నిర్వాహకుడు టి.సత్తిబాబు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందజేశాడు. అలాగే దత్తిరాజేరు మండలం మానాపురంలోని ఏటీఎం కేంద్రంలో నగదు అపహరణకు సంబంధించి మానాపురం సంతతోటలో గల ఏడుకొండలు వెల్డింగ్ షాపు యజమాని తన షాపులో నుంచి సిలిండర్‌తో పాటు గ్యాస్ కట్టర్ దొంగతనానికి గురైనట్లు పెదమానాపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు, అలాగే పెదమానాపురం గ్రామంలో గల స్వీట్ హోం నిర్వాహకులకు సంబంధించిన వ్యాన్ కూడా అపహరణకు గురైనట్లు ఫిర్యాదు చేశారు. రెండు పోలీస్‌స్టేషన్‌లకు చెందిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు నిర్వహిస్తూ, నిందితులను సాధ్యమైనంత త్వరగా పట్టుకునే పనిలో ఉన్నారు.

విశాఖలో పార్వతీపురం యువకుడి మృతి


మృతిచెందిన శివకుమార్

పార్వతీపురంటౌన్: మండలంలోని ఎస్.ములగ గ్రామానికి చెందిన పడాల శివకుమార్ బుధవారం రాత్రి విశాఖపట్నంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. శివకుమార్ విశాఖపట్నంలో హెయిర్ సెలూన్ షాపు నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆరిలోవ అవార్డుస్కిన్ డెవలప్‌మెంట్ జంక్షన్ వద్ద లారీ ఢీకొట్టడంతో మృతిచెందాడు.

భర్తపై బెదిరింపు కేసు నమోదు

సంతకవిటి: మండల పరిధిలోని గుళ్ల సీతారాంపురం గ్రామానికి చెందిన అక్కిన జోగలక్ష్మి(45) భర్త పీసపాటి రవికుమార్(52)పై బెదిరింపు కేసు నమోదు చేశామని ఏఎస్సై వాసుదేవరావు తెలిపారు. 2022లో విజయనగరంలో పీసపాటి రవికుమార్‌పై దిశ కేసు నమోదై ఉందని, ఈ క్రమంలో గురువారం ఆయన చంపుతానని బెదిరించడంతో భార్య జోగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై చెప్పారు.

లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం కొనుగోలు

- 2023-24 సీజన్ ఏర్పాట్లు, సన్నద్ధతపై జేసీ సమీక్ష



హాజరైన వివిధ శాఖల జిల్లా అధికారులు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: అధికారులు, సిబ్బంది బాధ్యతగా ఉండాలని నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను చేపట్టాలని జేసీ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. ఎలాంటి సమస్యలూ ఉత్పన్నం కాకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సూచించారు. ఈ మేరకు 2023-24 సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ, ఏర్పాట్లు, సన్నద్ధతపై గురువారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా ధాన్యం కొనుగోలు కమిటీ సమావేశం నిర్వహించారు. గత ఏడాది జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుని ఈ ఏడాది మరింత మెరుగ్గా ప్రక్రియను నిర్వహించాలని జేసీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ ఏడాది 4.37 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం చేరుకునేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ ఏడాది కొనుగోలు ప్రక్రియలో ఆర్డీవోలు భాగస్వామ్యం అవుతున్నారని డీవిజన్ పరిధిలో సమీక్షలు నిర్వహించి ముందస్తు చర్యలు తీసుకోవడంలో కీలకపాత్ర పోషించాలని సూచించారు. గ్రామస్థాయిలో అవగాహన సదస్సులు, క్యాంపులు నిర్వహించాలని చెప్పారు. రైతులకు అన్ని విషయాలపైనా పూర్తి అవగాహన కల్పించాలని ఆదేశించారు. కొనుగోలు జరిగే సమయంలో జిల్లా, డివిజన్ స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. మండల కమిటీలు ఏర్పటు చేసి క్షేత్రస్థాయిలో సందర్శనలు, అవగాహన శిబిరాలు పెట్టాలని, కొనుగోలు వివరాలను తెలుపుతూ ఆర్బీకేల వద్ద డిస్‌ప్లే బోర్డులు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

ధాన్యం తరలింపు వాహనాలకు జీపీఎస్

నూతన విధివిధానాలు, నిబంధనల మేరకు ధాన్యం తరలించే వాహనాలకు తప్పకుండా జీపీఎస్ అనుసంధానం చేయాల్సి ఉంటుందని జేసీ స్పష్టం చేశారు. దీనికి సంబంధించిన ఖర్చును వాహనదారులే భరించాల్సి ఉంటుందన్నారు. జీపీఎస్ అనుసంధాన ప్రక్రియను ట్రాన్స్‌పోర్టు విభాగం అధికారులు పరిశీలించాలని ఆదేశించారు. అలాగే రైతులు రిజిస్టర్ చేసుకున్న వారం రోజుల్లోగానే ధాన్యం సేకరించాలని జాప్యం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. కొనుగోలుకు సంబంధించిన అన్ని పరికరాలను అవసరానికి సరిపడా గోనె సంచులను గోదాములను సిద్ధంగా ఉంచుకోవాలని హితవు పలికారు. హమాలీల కొరత రాకుండా చూసుకోవాలని ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

క్వింటాకు రూ.143 పెరిగిన మద్దతు ధర

గత సీజన్ కంటే 2023-24 సీజన్‌లో సాధారణ, ఎ గ్రేడ్ ధాన్యం రకాలకు క్వింటాకు రూ.143 మద్దతు ధర పెరిగిందని సివిల్ సప్‌లైస్ డీఎం మీనాకుమారి తెలిపారు. గత ఏడాది సాధారణ రకం క్వింటా ధాన్యం రూ.2,040 ఉండగా ఈ ఏడాది రూ.2,183కి పెరిగిందని చెప్పారు. ఎ గ్రేడ్ రకం క్వింటా గత ఏడాది రూ.2,060 ఉండగా ఈ ఏడాది రూ.2,203కి పెరిగిందని వివరించారు. క్లస్టర్ వారీగా ఆర్బీకేలను విభజించామని కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్డీవోలు సూర్యకళ, శేషశైలజ, డీఎస్ఓ మధుసూదన రావు, మార్కెటింగ్, మార్క్‌ఫెడ్, వ్యవసాయ, ఉద్యాన, సహకార సంఘం, రవాణా శాఖ, తూనికలు కొలతల శాఖ అధికారులు, ధాన్యం కొనుగోలు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాగావళిలో నీటి ఉద్ధృతి

గడిచిన రెండు రోజులుగా వర్షాలు విస్తారంగా కురవడం, తోటపల్లి రిజర్వాయర్ నుంచి నీరు విడిచిపెట్టడంతో నాగావళి నది పొంగిప్రవహిస్తోంది. రంగారాయపురం వద్ద ఉన్న నారాయణపురం ఆనకట్ట నుంచి దిగువకు దుముకుతూ కడలిలో కలిసేందుకు పరుగులు తీస్తోంది.

– సంతకవిటి

